మౌలిక సదుపాయాలు కల్పించాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జనవరి 28 : జిల్లాలో ఉండే అన్ని వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి మంచి వాతావరణంలో విద్యార్థులు చదువుకునే అవకాశం కల్పించడం జరిగిందని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ హాలులో ఎస్సీ, బీసీ, గిరిజన సంక్షేమ అధికారులు, వసతి గృహాల వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉండే అన్ని వసతి గృహాలకు ఇప్పటికే మొదటి విడతగా మంజూరు చేసిన నిధులతో వసతి గృహాల్లో రిపేర్ పనులు పూర్తిచేశామన్నారు. ప్రతి వసతి గృహంలో చేసిన రిపేరుకు ముందు ఫొటోలు, తర్వాత ఫొటోలను పీపీటీ ద్వారా పరిశీలించారు. పనులకు సంబంధించి ప్రతి హాస్టల్‌లో రూఫ్ లీకేజీ, టాయిలెట్స్, రన్నింగ్ వాటర్, కిటికీలు, తలుపులు, తాగునీటికి ఆర్‌ఓ ప్లాంట్స్, అన్ని మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై మండలాలవారీగా పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏ హాస్టల్‌లో ఎంత మంది విద్యార్థులున్నారు, ఎన్ని రూములు ఉన్నాయి, ఏయే పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నవి, చేసిన పనులే కాకుండా ఇంకా మిగిలిపోయిన పనులకు నిధులు మంజూరు చేయుటకు అధికారులు స్క్రూటినీ చేసి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌డీఏ శ్రీనివాస్, సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారి మల్లేశం, బీసీ సంక్షేమ అధికారి ఉపేందర్, గిరిజన సంక్షేమ అధికారి కమలాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజినీర్లు మాధవరెడ్డి, శ్రీనివాస్, నాగభూషణం పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్

ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్

వికారాబాద్, జనవరి 28 : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్ అన్నారు. మంగళవారం వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ విధానంపై ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్స్‌కు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా జనరల్‌లో 38, ఒకేషనల్‌లో 10 ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జనరల్ ద్వితీయ సంవత్సరంలో 3782 మంది సైన్స్ విద్యార్థులు, ఒకేషనల్ కోర్సుల్లో మొదటి సంవత్సరంలో 797, ద్వితీయ సంవత్సరంలో 1336 మంది ప్రాక్టికల్ ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఎథిక్స్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష జనవరి 29న, ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ పరీక్ష జనవరి 30న, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షలు జనవరి 31న నిర్వహించడం జరుగుతుందన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 1న, సైన్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 3 నుంచి, జనరల్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 3 నుంచి నిర్వహించబడతాయన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 22 వరకు నిర్వహిస్తామని తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాల్లో కంప్యూటర్, ప్రింటర్, సీసీ కెమెరాలతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు బ్యాచ్‌ల వారీగా, సబ్జెక్టుల వారీగా నిర్వహించడం జరుగుతుందని వివరించారు.

విద్యార్థులు హాల్ టికెట్స్, ప్రాక్టికల్ టైమ్ టేబుల్ వారు చదువుతున్న కళాశాల ప్రిన్సిపాళ్ల వద్ద పొందవచ్చన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి కనీసం ఒక గంట ముందు చేరుకునేలా విద్యార్థులకు వారి తల్లిదండ్రులు సహకరించాలన్నారు. విద్యార్థులకు ఆర్టీసీ తగిన ఏర్పాట్లు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రభుత్వ రంగ, ప్రైవేట్ ఆన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

త్రైమాసిక పన్ను చెల్లింపునకు చివరి తేది జనవరి 31

జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి

వికారాబాద్, జనవరి 28 : జిల్లాలో వాహనాలకు త్రైమాసిన పన్ను చెల్లింపు చివరి తేది 31 జనవరి 2025న ముగుస్తుందని జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సుమారు 5000లకు పైగా వాహనాల పన్ను బకాయిలు దాదాపు రూ.2 కోట్లు ఉన్నాయన్నారు. పన్నును మీ సేవ లోగాని, ఆన్‌లైన్‌లోగాని చెల్లించాలని సూచించారు. గడువులోపు చెల్లించని వాహనాలకు అపరాధ రుసుము చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. వాహనదారులు తమ వాహనాన్ని వారి మొబైల్ నంబర్‌కు లింక్ చేసుకోవాలని చెప్పారు. తద్వారా వాహనానికి సంబంధించిన సమాచారం లైసెన్స్ రెన్యువల్ ఫిట్‌నెస్, రెన్యువల్, ట్యాక్స్ పేమెంట్స్ తదితర సమాచారం మొబైల్ ఫోన్ అలర్ట్‌గా పొందవచ్చన్నారు. మరింత సమాచారం కోసం 9848528441ను సంప్రదించాలన్నారు.

దోమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డా.రవీంద్రయాదవ్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

జిల్లా టీబీ అధికారి డా.రవీంద్రయాదవ్

దోమ, జనవరి 28 : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచే దిశగా వైద్యులు, ఆశావర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా టీబీ అధికారి డా.రవీంద్రయాదవ్ అన్నారు. దోమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసి ఆసుపత్రి ఆవరణ, డెలివరీ రూమ్, ఫార్మసీ,ల్యాబ్ తదితరాలతో పాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌పై వైద్యులకు అవగాహన కల్పించారు. ప్రసవాల సంఖ్యపై వంద శాతం టార్గెట్ అచీవ్ కావాలని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలో డెలివరీ కేసులపై ఆరా తీయగా.. కేవలం రెండు డెలివరీలు మాత్రమే అయినట్లు సంబంధిత అధికారి తెలిపారు. దీంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. సిబ్బంది తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ రజిత, ఎంపీహెచ్‌వో ప్రభులింగం, సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

2 కోట్ల విలువ చేసే డ్రగ్స్, గంజాయి కాల్చివేత

నందిగామ, జనవరి 28 : తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య, సైబరాబాద్ సీపీ అవినాశ్ మొహంతి పర్యవేక్షణలో సీజ్ చేసిన డ్రగ్స్‌ను మంగళవారం కాల్చివేశారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మోత్కులగూడ గ్రామ శివారులోని జీజే మల్టికైవ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో సైబరాబాద్ డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ పర్యవేక్షణలో 872 కిలోల నార్కోటిక్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 845 కిలోల గంజాయి, 61 గ్రాముల మూడు గంజాయి మొక్కలు, 26 కిలోల గంజాయి చాక్లెట్లు, 7.5 మి.లీ హషీశ్ ఆయిల్, 9 గ్రాముల ఎమ్‌డీఎమ్‌ఏ, 502 గ్రాముల అల్ఫాజోలంలు ఉన్నాయి. విటీ విలువు రూ.2,25,93,285 ఉంటుందని తెలిపారు.

ఆరుతడి పంటలతో అధిక లాభాలు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింహారావు

రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయశాఖ అధికారులు, రైతులు

కేశంపేట, జనవరి 28 : రైతులు శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ పంటలను సాగు చేయాలని, ఆరుతడి పంటలతో అధిక లాభాలు అర్జిస్తారన్న విషయాన్ని గుర్తించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింహారావు అన్నారు. మండలంలోని అల్వాల రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయశాఖ అధికారి పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆరుతడి పంటలైన అపరాల(పెసర, మినుములే) సాగు గురించి రైతులకు వివరించారు. ఆయా పంటలను సాగు చేస్తే రైతులు అధిక లాభాలు అర్జిస్తారన్నారు. ఆరుతడి పంటలు సాగు చేస్తే నీటి ఆదాతో పాటు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. అపరాల సాగుకు తక్కువ కాలపరిమితి ఉంటుందని, తద్వారా ఎక్కువ పంటలు సాగు చేసే వీలుంటుందన్నారు. పంటల మార్పిడి ద్వారా నేల సారాన్ని సైతం కాపాడుకోగలమని, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రాజారత్నం, మండల వ్యవసాయశాఖ అధికారిణి శిరీష, ఏఈవోలు వినయ్, సుధ, నిఖిల్, రాజేశ్వరి, ప్రశాంత్ పాల్గొన్నారు.

- ముఖ్యమంత్రులు బూర్గుల, మర్రి అభ్యసించింది ఇక్కడే..
- 496 మంది విద్యార్థులు, 34 మంది ఉపాధ్యాయులతో అలరారుతున్న సర్కారు బడి
- ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న యంత్రాంగం

చరిత్ర ఎంతో ఘనం

152 వసంతాలను పూర్తి చేసుకున్న మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

షాద్‌నగర్‌రూరల్, జనవరి 28 : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ పాఠశాలలోనే నిర్మితమవుతుంది. క్రమశిక్షణతో కూడిన విద్యను బోధిస్తే విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఎంతో మందికి ఉజ్వల భవిష్యత్ అందించి నేడు 152 వసంతాలు పూర్తి చేసుకుంటున్నది ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. ఈ పాఠశాలలో గతంలో విద్యనభ్యసించినవారు ఎంతో మంది ఉన్నత హోదాలు, అధికారాలను చేపట్టారు. ఇలా చెప్పుకొంటూ పోతే ఈ మొగిలిగిద్ద పాఠశాలకు, గ్రామానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉన్నది. అందుకే మొగిలిగిద్ద పాఠశాల గురించి రాష్ట్రంలో తెలియనివారు ఉండరు.

1873లో ఏర్పాటైన పాఠశాల

ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద పాఠశాలను నాటి నవాబు కాలంలో 1873లో ఏర్పాటు చేశారు. నాటి నుంచి ఈ పాఠశాలలో ఎంతో మంది విద్యాబోధన చేశారు. హైదరాబాద్ తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు విద్యనభ్యసించింది ఈ పాఠశాలలోనే. మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రముఖులు సత్యనారాయణ, శ్రీనివాసరావు, రాఘవాచారి, మల్లారెడ్డి, శంకరప్ప, మహాత్మారెడ్డి తోపాటు ఎంతో మంది విద్యావంతులు, సమాజ సేవకులు, నాయకులు చదివింది ఈ పాఠశాలలోనే కావడంతో ఈ పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు ఉంది. 1973 నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నాడు ఆర్థికశాఖ మంత్రి రామచంద్రారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ కేకేరెడ్డి ఈ పాఠశాలకు విచ్చేసి పాఠశాల చరిత్రను తెలుసుకున్నారు.

152 వసంతాలు పూర్తి

ఎంతో మంది విద్యార్థులను భావితరాల పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఈ మొగిలిగిద్ద పాఠశాల 152 వసంతాలను పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామస్తులు, పాఠశాలలో చదువుకున్న ప్రముఖులు 152 వసంతాల కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా చేసేందుకు నడుంబిగించారు. ఇందులో భాగంగానే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ప్రొఫెసర్ హరగోపాల్ ఈ పాఠశాల చరిత్రను ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డికి వివరించి ఈ నెల 31న మొగిలిగిద్ద పాఠశాలకు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. సీఎం పర్యటనపై అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు రానప్పటికీ ఇప్పటికే కలెక్టర్, అధికారులు రెండు పర్యాయాలు మొగిలిగిద్ద పాఠశాలను పరిశీలించారు. దీంతో మొగిలిగిద్ద పాఠశాలకు సీఎం వస్తారని కాంగ్రెస్ నాయకులు బలంగా విశ్వసిస్తున్నారు.

సీఎం రాకతో మారనున్న మొగిలిగిద్ద రూపురేఖలు

మొగిలిగిద్ద గ్రామంతో పాటు పాఠశాలలో ఎన్నో సమస్యలు తాండవిస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి రాకతోనైనా గ్రామం, పాఠశాల రూపురేఖలు మారుతాయని గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా మొగిలిగిద్ద గ్రామాన్ని మండలంగా చేయాలంటూ గ్రామస్తులు ఎప్పటి నుంచో తమ వాదనను వినిపిస్తున్నారు. అదే విధంగా మొగిలిగిద్ద పాఠశాలలో బాత్రూంలు, అదనపు తరగతి గదులు, విద్యార్థులకు మౌలిక వసతులు, పాఠశాల ఆవరణలో వసతి గృహం ఏర్పాటు కోసం సీఎంకు విన్నవించేందుకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. మొగిలిగిద్ద గ్రామంలో సీసీ రోడ్లు, మౌలిక వసతులు సీఎం రాకతోనైనా పూర్తవుతాయని గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు.

మొగిలిగిద్ద పాఠశాలకు విచ్చేసిన అప్పటి కలెక్టర్ నారాయణరెడ్డి(ఫైల్)

సమస్యల వలయంలో పాఠశాల

ఎంతో మందికి ఉన్నత విద్యను అందించి వారి ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసిన ఈ మొగిలిగిద్ద పాఠశాలలో నేడు సరైన మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలలో మొత్తం 496 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో 153 మంది తెలుగు, 268 మంది ఇంగ్లిష్, 75 మంది ఉర్దూ మీడియంలో విద్యనభ్యసిస్తున్నారు. 34 మంది ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. పాఠశాలలో ప్రస్తుతం 13 గదులు మాత్రమే ఉన్నాయి. వీటిలో చాలా తరగతి గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థినులకు కేవలం ఒకే టాయిలెట్ ఉన్నది. ఉన్న ఒక్కదానిని బాలికలకు కేటాయించగా.. బాలురు రోడ్డు సమీపంలోకి వెళ్తున్నారు. దీంతో రోడ్డు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత పెద్ద పాఠశాలలో స్వీపర్ లేకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

చదువుకున్న చోటే ఉద్యోగం

ఎంతో చరిత్ర కలిగిన మొగిలిగిద్ద పాఠశాలలోనే విద్యనభ్యసించాను. ఇక్కడ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉపాధ్యాయుడిగా ఉద్యోగాన్ని సాధించా. నేడు నేను చదువుకున్న పాఠశాలలోనే ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నాను. చదువుకున్న చోటే ఉద్యోగం చేయడం సంతోషంగా ఉన్నది. సీఎం రాకతో మా పాఠశాల మరింత అభివృద్ధి చెందనున్నది.

- బీ.ఎం.వీ రాజు, ఉపాధ్యాయుడు, మొగిలిగిద్ద పాఠశాల

ఇక్కడ చదువుకున్నందుకు గర్వపడుతున్నా..

ఎంతో మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దిన మొగిలిగిద్ద పాఠశాలలోనే నేను చదువుకున్నా. ఇక్కడ విద్యనభ్యసించి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందాను. బదిలీలో భాగంగా ఇదే పాఠశాలలో బోధిస్తున్నాను. నేను చదువుకున్న పాఠశాలలోనే విద్యను బోధించడం చాలా సంతోషంగా ఉన్నది. సీఎం రాకతో పాఠశాల పేరు ప్రఖ్యాతలు మరింత పెరుగుతాయి.

- చంద్రశేఖర్, ఉపాధ్యాయుడు, మొగిలిగిద్ద పాఠశాల

పాఠశాలకు మరింత పేరు తెస్తా..

ఇక్కడ చదువుకున్న ఎంతో మంది మంచి ఉద్యోగాలు, నాయకులుగా ఎదిగారు. నేను మంచిగా చదువుకుని భవిష్యత్‌లో కలెక్టర్‌ను అవుతా. మా పాఠశాల పేరు దేశవ్యాప్తంగా వినిపించేలా తోటి విద్యార్థులు కృషి చేయాలి. పాఠశాలకు సీఎం రానుండడం సంతోషంగా ఉన్నది.

- శివ, 10వ తరగతి విద్యార్థి, మొగిలిగిద్ద పాఠశాల

జీవితాంతం గుర్తుంటుంది

సీఎం రేవంత్‌రెడ్డి మా పాఠశాలకు విచ్చేస్తే మాకు జీవితాంతం గుర్తుంటుంది. ఇక్కడ క్రమశిక్షణతో విద్యను బోధిస్తున్నారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి. మేము శ్రద్ధగా చదువుకుని మా పాఠశాలకు మంచిపేరు తెస్తా.

- పూజ, 10వ తరగతి విద్యార్థిని, మొగిలిగిద్ద పాఠశాల

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఉద్యోగుల పాత్ర కీలకం

- రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం 2025 సంవత్సర డైరీ అవిష్కరణ

ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఆదిబట్ల, జనవరి 28 : ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలోఏర్పాటు చేసిన జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం 2025 సంవత్సర డైరీని అదనపు కలెక్టర్ టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు చేరవేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి ఉద్యోగులు వారధిలా పని చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఉద్యోగులు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. కలెక్టరేట్ ఉద్యోగులకు 24 శాతం హెచ్ఆర్ఏను పునరుద్ధరించాలన్నారు. అధికారులు ఉద్యోగ పనుల నిమిత్తం ఓఆర్ఆర్‌లో వెళ్లినప్పుడు టోల్ టాక్స్ పడకుండా మినహాయింపు ఇవ్వాలని కోరారు. జిల్లాలో టీజీవో భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని, జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఓ గదిని కేటాయించాలని కోరారు.

జిల్లా టీజీవోఎస్ ప్రెసిడెంట్ డాక్టర్ రామారావు మాట్లాడుతూ.. ఉద్యోగుల సహకారంతో అన్ని సంక్షేమ పథకాలను అమలుపర్చడంలో, కలెక్టర్ ఆదేశానుసారం మన జిల్లా అధికారులు ముందున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ ప్రోత్సాహంతో మునుముందు మరింత రెట్టింపు ఉత్సాహంతో పని చేసి రంగారెడ్డి జిల్లాకు రాష్ట్రంలోనే ప్రథమ స్థానం వచ్చేటట్లు పని చేస్తామన్నారు. కార్యక్రమంలో టీజీవోఎస్ సెంట్రల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సురేశ్‌కుమార్‌నోరీ, అసోసియేట్ అధ్యక్షుడు పీసీ వెంకటేశ్, కోశాదికారి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు

ఉద్యమకారులకు దక్కని సీఎం అపాయింట్‌మెంట్

మన్సూరాబాద్, జనవరి 28: ఉద్యమ స్ఫూర్తితో ఏర్పడిన తెలంగాణలో ఉద్యమకారులకే గుర్తింపు లేకుండా పోయిందని 1969 తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు చక్రహరి రామరాజు ఎద్దేవా చేశారు. ఉద్యమకారులకు సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ దొరకకపోవడం దురదృష్టకరమన్నారు. 1969 ఉద్యమకారుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశాన్ని మంగళవారం మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఇందిరానగర్ కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రహరి రామరాజు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చేందుకు జరిగిన నాటి ఉద్యమంలో 369 మంది ఉద్యమకారులు పోలీసుల తూటాలకు బలవ్వడమే కాకుండా ఆనాటి విద్యార్థులు ఒక సంవత్సరం విద్యా సంవత్సరాన్ని కోల్పోయారని గుర్తుచేశారు. సీఎం వెంటనే తమకు అపాయింట్‌మెంట్ ఇచ్చి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు.

పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 28 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువును పొడగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 1వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో 6వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 28 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి వచ్చే నెల 4వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 6వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

చెరువుల నోటిఫికేషన్‌లో జాప్యం

సిటీబ్యూరో : హెచ్ఎండీఏ పరిధిలో చెరువుల హద్దుల నిర్ధారణ సాగుతూనే ఉన్నది. నెల రోజుల వ్యవధిలో 150కిపైగా చెరువులకు హద్దులను నిర్ధారించి తుది నోటిఫికేషన్ జారీ చేశారు. 9 నెలలుగా సాగుతున్న ఈ ప్రక్రియలో 849 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్ చేయగా.. 2043 చెరువులు ప్రాథమిక హద్దుల నిర్ధారణ జరిగిన జాబితాలో ఉన్నాయి. హెచ్ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల మధ్య తలెత్తున్న సమన్వయ లోపం కారణంగా హద్దుల నిర్ధారణలో ఇబ్బంది అవుతుందని, దీంతోనే ప్రక్రియ జాప్యం జరుగుతున్నట్లుగా హెచ్ఎండీఏ లేక్ విభాగం సిబ్బంది చెబుతున్నారు. ఇటీవల హెచ్ఎండీఏ పరిధిలో చెరువుల పరిరక్షణపై హైకోర్టు సీరియస్ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

పీజీ కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 28 : ఓయూ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు